# తండ్రుల నిర్వాకం

"ఒక పది రూపాయలివ్వు - మా అక్కను తోడుకొస్తాను" అని వినోద్ అనకుండా ఉండి ఉంటే, అసలు కథే ఉండి ఉండదు.

డబ్బుకు లోటులేని ప్రముఖ వ్యాపారి లోకనాథం గారి అబ్బాయి ప్రభు. బి.ఏ. పరీక్ష పోవటంతో కలలు కంటూ ఇంట్లోనే కూర్చోటానికి వీలు దొరికిందతనికి. దొరికే వాటిని డబ్బిచ్చి కొనుక్కుంటూ, దొరకని వాటిని కలల్లో వెతుక్కుంటూ రోజులు గడుపుతున్న ప్రభు పదిపైసలిచ్చి పనస తొన కొనుక్కున్నంత సులభంగా మాలతి తన నోటికి అందుతుందని కలలోనైనా వూహించలేదు.

మాలతి తులసి కూతురు. ఆ సంవత్సరమే ఇంటర్‌లో చేరింది. అప్పుడే యౌవనంలోకి దూసుకొచ్చి ఆకర్షణీయంగా కనిపించే మాలతిని వీధి కొళాయివద్ద చూసినప్పుడు పడుచు కుర్రాళ్ళకు నోరూరుతుందంటే, అందులో ఆశ్చర్యం లేదు. మొగుడి సంపాదన సంసారానికి చాలదేమో, తులసి ఒకటి రెండు ఇళ్ళల్లో పాచిపనులు చేస్తున్నది. ఆమె కొడుకు వినోద్ తొమ్మిదో తరగతిలో ఉన్నాడు. వాడికి చదువుపైన కాక, ఇరుగు పొరుగు వాళ్ళు చెప్పే చిల్లర మల్లర పనులు చేసిపెట్టి ప్రతిఫలం పొందటంలోనే శ్రద్ధ ఎక్కువ. చింపిరి జుట్టుతో, చీమిడి ముక్కుతో అస్తమానం తల్లి కొంగు పట్టుకుని తిరిగే మరో ఎనిమిదేళ్ళ కూతురుకూడా ఉంది తులసికి.

వినోద్ నోటివెంట ఆ మాట వినగానే ప్రభు గుండె జల్లుమంది. గొంతులో గుండె అడ్డుపడి నిమిషంపాటు వూపిరాడలేదు. ముఖంలో మెరుపు తీగలు పరుగులు తీస్తుండగా, "ఏమిటేమిటీ?" అన్నాడు ప్రభు.

"అవును. మా అక్కను తోడుకొస్తాను ఇప్పుడు పది రూపాయలిచ్చావంటే!" అన్నాడు వినోద్ నేల చూపులు చూస్తూ.

తనలాంటి నవయువకుడు ఎంతో అపురూపంగా భావించే అందాలూ అనుభవాలూ జంకూ గొంకూ లేకుండా ఇంత సులభంగా బేరానికి రావడం కంటె ఆశ్చర్యకరమైన విషయం మరొకటి ఉండబోదు - ప్రభుకు!

"మీ అక్క అడగమన్నదా?"

"అదంతా నీ కెందుకు?" అన్నాడు వినోద్, విసుక్కుంటున్నట్లుగా.

అరుదైన అమూల్య వస్తువు కారుచౌకగా దొరికేటప్పుడు వెంటనే కొనెయ్యటం వ్యాపార లక్షణం. పది రూపాయల కాగితాన్ని వినోద్‌కు అందిస్తూ, "ఎప్పుడు తోడుకొస్తావ్?" అన్నాడు ప్రభు.

నోటు జేబులో ఉంచుకుని, "నువ్వెప్పుడంటే అప్పుడే!" అన్నాడు వినోద్.

శుభకార్యానికి ఆలస్యమెందుకనుకున్నాడో ఏమో, "ఈ రాత్రికే రమ్మను నా గదికే!" అన్నాడు ప్రభు.

"సరే!" అంటూ నిష్క్రమించాడు వినోద.

ప్రభు గది మేడమీద ప్రత్యేకంగా ఉంది.వీధిలో నుంచి మేడ మెట్లెక్కి పోవడానికి ఏ ఆటంకమూ ఉండదు.

మాలతి ఇలాంటి చాటుమాటు వ్యవహారాలకు అలవాటు పడటమన్న విషయం గురించి ఆలోచించే కొద్దీ ప్రభు ఆశ్చర్యం అంతకంతకూ అధికం కాసాగింది. ఆ రాత్రి అతడి అనుభూతి అనుభవైకవేద్యం! పది గంటలు దాటాక వూరు సద్దుమణిగిన వేళ మాలతి తన గదికి రావచ్చుననుకున్నాడతను. పదకొండు గంటల వరకూ తీయని వూహలు, ఎదురుతెన్నులు! ఆ తరవాత అతడి అవస్థ వర్ణనాతీతం! తెల్లవారేదాకా దుర్భరమైన నిద్రలేమి. ఆ నిద్రలేమికి కారణం - మాలతి అసలు రాకపోవడమే!

పని ఉన్నా, లేకపోయినా నిత్యం ప్రభును కలుసుకునే వినోద్ రెండు రోజుల పాటు కంటికైనా కనిపించలేదు. మాలతి వీధిలో కనిపించినప్పుడు కన్నార్పకుండా చూడడంతోనూ, ఆమె తప్పకుండా వస్తుందన్న నమ్మకంతో రాత్రి తెల్లవార్లూ కంటిమీద కునుకు లేకుండా ఎదురుతెన్నులు కాయడంతోనూ ఆ రెండు రోజులూ గడిచిపోయాయి. మూడో రోజున వీధి మలుపులో ఎదురుపడిన వినోద్‌ను చనువుగా చంకలో ఇరికించుకుని తన గదికి తీసుకువచ్చి, "ఏదిరా మీ అక్క?" అన్నాడు ప్రభు.

వినోద్ వెంటనే బదులు చెప్పలేక కొంత సేపు నీళ్ళునమిలి, "ప్రభూ! మా అక్క రాదు. కావాలంటే మా అమ్మ వస్తుంది" అంటూ ఒక్కొక్క మాటగా వెళ్ళగక్కాడు.

గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లయింది ప్రభుకు. "ఛీ పోరా! ఇంత తప్పుడు కుటుంబాన్ని నే నెక్కడా చూడలేదు. మీరంతా నన్ను బాగా మోసం చేశారు" అంటూ ఖిన్నుడై కూర్చుండి పోయాడు.

'వీడి అక్కకూ, వీడి తల్లికీ తన డబ్బు మాత్రం కావల్సివచ్చింది. అయితే తన దగ్గరికి కూతురు రాదట,తల్లి వస్తుందట! ఛీఛీ! వీళ్ళేం మనుష్యులా బాబూ!'

వినోద్ నోటివెంట వచ్చిన పచ్చి మాటలు విన్న ప్రభుకు వాడిమీద, వాడి తల్లిమీద మొదట రోతపుట్టిన మాట వాస్తవం. అయితే, పరిస్థితులతో సర్దుకుపోవాలన్న అంతరాత్మ ప్రబోధంతో ఆ అసహ్యాన్ని సైతం అత్తరుబుడ్డీగా మార్చుకోవడమే కర్తవ్యంగా భావించాడతను.

బాగుంటుందని అనుకోవాలే గానీ, తులసికి మాత్రం ఏమి సొట్ట? సన్నగా, నాజూగ్గానే ఉంటుంది. వయస్సు ముప్పయి అయిదేళ్ళ లోపునే ఉండచ్చు. తలలో ఒకటి రెండు వెంట్రుకలు తెల్లబడ్డాయి కానీ, చూడటానికి తులసి పాతికేళ్ళ దానిలా కనిపిస్తుంది.

మూడు రాత్రులుగా తీగలు సాగుతున్న పిచ్చి వూహల్ని ఏదో ఒక పందిరిమీదికి ఎక్కించడమే వివేకవంతమైన పనిగా అనిపించింది ప్రభుకు.

"అయితే, మీ అమ్మ వస్తుందన్నమాట!" అన్నాడతను, ఎవరి ప్రాప్తం అంతే నన్నట్లున్న వేదాంత ధోరణిలో. "సరే! ఈ రాత్రికే మరి! మేడపైకే వచ్చేయమను."

రాత్రి చందమామ వచ్చాడు. వెళ్ళిపోయాడు. తులసిమాత్రం రాలేదు. ఆ విరహంలో తులసి అందంతో సాటివచ్చే అందం మరేదీ కనిపించలేదతనికి. వీలు చూసుకుని వస్తుందనుకున్న తులసి ఆ మరునాటి రాత్రి కూడా రాలేదు. ప్రభు హతాశుడైపోయాడు.

నాలుగు రోజులు దాగుడు మూతలాడిన వినోద్ అయిదోనాటి సాయంకాలం ప్రభు పంజాల్లోంచి తప్పించుకోలేకపోయాడు. నడివీధిలో వాణ్ణి పట్టుకుని "మీ అమ్మ సంగతేం చేశావురా?" అని గద్దించాడు ప్రభు. బెదురు చూపులు చూస్తూ 'అమ్మరాదు' అన్నాడు వాడు.

వాడి నంగనాచితనం చూచి కోపంతో ఒళ్ళు మరిచిపోయాడు ప్రభు. "తప్పుడు నా కొడకా! మరైతే అక్క పేరుచెప్పి, అమ్మ పేరు చెప్పి నా దగ్గర పది

రూపాయలెందుకు తీసుకున్నావ్? ముందు నా పది రూపాయలు అక్కడ పెట్టు. మీ అమ్మ చెప్పినా వదిలేదిలేదు, మీ అక్క చెప్పినా వదిలేదిలేదు" అంటూ వాడి చొక్కా ఒడిసి పట్టుకున్నాడు. వినోద్ బావురుమన్నాడు. వీధిలో జనమంతా పోగయ్యారు. ప్రభు తిట్ల ప్రవాహంలో ఆ ఇద్దరి గుట్టూ రట్టయిపోయింది.కొళాయి వద్ద నిలబడ్డ మాలతి సంగతేమిటో అర్థంకాగానే బిక్క చచ్చిపోయి, బిందె అక్కడే వదిలిపెట్టి, ఇంట్లోకి తుర్రుమంది. తులసి అడ్డు వెళ్ళి ప్రభు పట్టునుంచి కొడుకును విడిపించగానే, వాడు పరుగందుకున్నాడు. వీధిలో వాళ్ళకు ఆ సాయంకాలమంతా చక్కని కాలక్షేపం జరిగింది.

మనిషి చచ్చిపోదామన్న నిర్ణయానికి వచ్చాడంటే అందుకు బలమైన కారణం ఉండాలి. పరువును రచ్చకీడ్చి బట్టలూడదీసిన ఈ సంఘటన వెంకట దాసును కల్లోల పరిచింది. వెంకట దాసు వినోద్ తండ్రి. అతడు పొద్దుపోయి ఇంటికి వచ్చాడు. వివస్త్రంగా పడి రోదిస్తూన్న తన ఇంటి పరువు కళ్ళబడగానే అతనికి చివ్వున శివమెత్తింది.

కళ్ళవెంట నిప్పులు కురిపిస్తూ " ఆ అబ్బాయితో అలా ఎందుకన్నావురా?" అని అడిగాడు కొడుకును.

వాడి గొంతు పూడుకుపోయింది.

"ఆ పది రూపాయల్ని ఏం చేశావు? చెప్పరా వెధవా!"

"హొటల్ లో టిఫిన్ తిన్నాను. సినిమా చూశాను. పేనా లేదంటే మాలతికి మూడు రూపాయలిచ్చాను. చిట్టికి అర్ధరూపాయి ఇచ్చాను."

"ఇవన్నీ కావాలంటే ఇదేనా దారి? ఇంతకంటే ఏ రైలుకిందోపడి చావరాదట్రా సిగ్గుమాలిన్నాకొడకా!" అంటూ తన బ్రతుకును పట్టి పల్లార్చుతున్న అదృశ్య శక్తులపైన తనకున్న కోపాన్నంతా కొడుకుమీద ప్రయోగించాడు దాసు.

అయితే, ప్రహ్లాదుడి తర్వాత అంత గట్టి ప్రాణం వీడిదేనన్న విషయం మాత్రం తేలిపోయింది.

దాసు కోపం క్రమంగా చల్లారి, తన మీద తనకే అసహ్యం, కొడుకుమీద జాలీ అవధులు లేనంతగా పొంగుకొచ్చేశాయి. తన కుటుంబం నడివీధిలో నవ్వుల పాలైనందుకు కాక, తల్లినీ, తోడబుట్టిన దాన్నీ ఎరగా చూపి అవసరం గడుపుకుందామన్న నికృష్టమైన ఆలోచనకు కొడుకు లోనైనందుకే దాసు సిగ్గుతో చిమిడిపోయాడు. చప్పిడి మెతుకులతో నాలుక చచ్చిపోయిన తన కొడుకు-

వేడుకలకూ విలాసాలకూ బానిసైపోయిన సమాజంలో రూపాయి విలువచేసే వినోదానికే ముఖం వాచిపోయిన తనకొడుకు ఆ కోరికలు తీర్చుకోటానికి ఆరాటపడటంలో తప్పేముంది? ఒక పిల్లాడికి తండ్రిగా తన బాధ్యతలు నెరవేర్చటంలో కృతకృత్యుడు కాలేకపోయినప్పుడు, ఆ పిల్లాడు తార్పుడుగాడైతే, అది వాడి తప్పెలా అవుతుంది? సంసార నౌక నడపటంలో మొగుడు చేతకాని వాడైనప్పుడు, పరాయివాడు ఆ ఇంటిలోని ఆడతనాన్ని కొనటానికి అర్రులు చాచితే, అది ఆడదాని తప్పెలా అవుతుంది? ఈ తప్పులన్నీ తండ్రిదే! చీమూ నెత్తురూ, సిగ్గూ ఎగ్గూ, లజ్జా పజ్జా, మానం మర్యాద, పరువూ పౌరుషం ఉన్నవాడైతే తండ్రిగా ఘోర పరాజయం చవిచూసిన వాడెవ్వడూ మళ్ళీ తలెత్తుకుని తిరగలేడు. ఆ తలను మట్టిలోనో, మంటలోనో దాచేసుకుని మాన ధనుడనీ, పౌరుషవంతుడనీ అనిపించుకుంటాడు.

దాసు పౌరుషాన్ని అణుమాత్రమైనా సందేహించటానికి వీల్లేదు. అతడి ప్రాణమూ, శరీరమూ ఒక దాని పట్ల మరొకటి విరక్తి చెందాయి. ఆ రెంటినీ వేరుచేయటానికి గుక్కెడు విషాన్ని జేబులో పదిల పరుచుకుని, గరళ సేవనానికి మరింత గుండె దిటవును ప్రోదిచేసుకోవటానికి సీసాడు గవర్నమెంటు సారా చేతపట్టుకుని వూరి పొలిమేరల వైపుగా మహా ప్రస్థానం మొదలు పెట్టాడు దాసు.

వూరు దాటుకుని తాగుతూ, తూలుతూ చీకట్లో తారాడుతూ మూడు మైళ్ళ దూరం నడిచి, రోడ్డు మధ్యలో ఆగిపోయాడు. ఖాళీ అయిన సీసాను వెయ్యి ముక్కలయ్యేటట్లుగా నడిరోడ్డులోనే విసిరికొట్టాడు. జేబులోంచి విషం సీసా తీసి, పైకెత్తి పట్టుకున్నాడు. అప్పుడు అతడి కోసమే నన్నట్లు దివ్య విమానంలా రివ్వున ఓ కారు వచ్చి కిర్రోమని వూగిసలాడిపోతూ అతడి వద్ద ఆగిపోయింది.

కారు డ్రైవరు ధుమధుమలాడుతూ కిందికి దిగి, "ఏమిరా మొద్దూ! ఇంట్లో చెప్పొచ్చావా, లేదా?" అంటూ దాసు పైకొచ్చాడు.

"నేను చెప్పకపోతేనేం? నువ్వెళ్ళి చెప్పొచ్చుగా?" అన్నాడు దాసు.

"ఈ రోడ్డు మీ అత్తగారిచ్చిన అంటు మామిడి తోటనుకున్నావా? అవతలికి తప్పుకో!"

"అవతలికి తప్పుకోటానికేగదా వచ్చాను. కారు నా పైనుంచే వెళ్ళనీ! అప్పటికీ ప్రాణం పోకపోతే, ఇదిగో, ఈ ఎండ్రిన్ తాగేస్తాను."

దాసు ఇలా అనగానే కారు వెనక తలుపు బార్లా తెరుచుకుంది. పలావు, కుర్మాపులుసు మరకలతో, ఒలికిన విస్కీ తడి ముద్రలతో, వాసికెక్కిన ప్రజాస్వామ్యంలా గుప్పుమంటున్న ఖద్దరు లాల్చీ ధోవతీ కండువా టోపీలతో ఒక దివ్య మంగళ భారీ విగ్రహం కారులో నుంచి పచ్చి మాంసపు మూటలా భారంగా బయటకు వచ్చింది. ఆయన ఎవరో కాదు. కడచిన ఎన్నికల జాతరలో జనం పూనకం వచ్చి "కరుణించి మమ్మేలు కమల లోచనుడా" అంటూ శివమెత్తి పాడగా, అభయ హస్తమిచ్చి, ఆ నియోజక వర్గం నుంచి పాదం సాచి, ఏలికల కొలువులో సుఖాసీనుడైన గౌరవ నీయుడు నామాలయ్య!

రేపో మాపో వరదలా ముంచుకు రాబోతున్న ఎన్నికల్లో తన స్థానాన్ని పదిల పరుచుకోవటానికి ముందు జాగ్రత్తగా ఆయన వూరూ వాడా తిరిగి గ్రామ పెద్దల్ని కూడగట్టుకుంటున్నాడు. ఆ రోజు కూడా నాలుగు గ్రామాలు పర్యటించి, నాలుగు పెద్ద తలకాయల్ని లాల్చీ జేబులో పడేసుకుని, ఒక ప్రముఖుడి ఇంట్లో మందూ విందూ దట్టించి అపరాత్రివేళ ఇంటికి తిరిగి వస్తూండగా, దున్నపోతులా దారికి అడ్డొచ్చాడు దాసు.

అతడి మాటలు చెవిని పడగానే నామాలయ్య కాలు విరిగిన గోంద్రుకప్పలా పడుతూ లేస్తూ అతణ్ణి సమీపించి, ముఖంలోకి తొంగిచూచి, "అయ్యయ్యో, పెద్దవాడివేనే! నీకు వోటు ఉండే ఉంటుంది. ఓటరు మహాశయా! ఓటు విలువ నీకు తెలియదా? నువ్వు చచ్చిపోతే ఎంతో విలువైన వోటు ఒకటి వృథా అయిపోతుంది కదా? నీ పవిత్రమైన వోటును మాకిచ్చి...." అంటూ ఉపన్యాస ధోరణి మొదలెట్టాడు.

నామాలయ్యను సులభంగానే గుర్తించిన వెంకటదాసు "తండ్రీ!" అంటూ భక్తిపూర్వకంగా చేతులు జోడించి, "నా వోటు ఎందుకు చించేస్తున్నానంటే.." అని ఆ తర్వాత వెక్కి వెక్కి ఏడ్చేశాడు.

నామాలయ్య అతడి భుజాల చుట్టూ చెయ్యి వేసి, "చూస్తూ చూస్తూ ఒక వోటును మేము పోగొట్టుకోలేము. ఇంటికి వెళ్ళి మాట్లాడుకుందాం, పద" అంటూ అతణ్ణి నడిపించుకొచ్చి కారులో కూచోబెట్టాడు.

కారు బంగళావద్ద ఆగగానే దాసు చేతిని తన చేతిలో ఇరికించుకుని, బురదపాములా మందకొడిగా మెలికలు తిరుగుతూ సరాసరి తన పడక గదిలోకి తీసుకుపోయాడు. దాసు తివాసీ మీద చతికిలబడ్డాడు. నామాలయ్య టోపీ తగిలించాల్సిన చోట చెప్పుల్ని తగిలించి, మంచం కింద చెప్పులకు బదులుగా టోపీని విసిరేసి, "ఇక చెప్పు!" అన్నాడు.

దాసు చేతులు జోడించి, తన కొడుకు సంగతి చెప్పాడు. ఆ చెబుతున్నంతసేపూ అతడు నామాలయ్యను తండ్రీ, తండ్రీ అని సంబోధించాడు. చివర, "నేను పేదోణ్ణే కావచ్చు. అయితే పేదరికం అంటే కూడూ గుడ్డా లేకపోవడం ఒక్కటే కాదు. ఈ బీదరికం మనిషి బుద్ధిని గొంగళి పురుగులా కొరికి కొరికీ తినెయ్యటం అనేది ఉంది చూశారా తండ్రీ! దానికంటే హీనమైన పేదరికం మరొకటుందంటారా? నా కొడుకు బుద్ధికి చీడ పట్టకుండా అరికట్ట లేకపోయిన నేను ఒక తండ్రినేనా? ఈ ఒక్క కారణానికే తండ్రీ! నేను చచ్చిపోతున్నాను, సిగ్గుతో చచ్చిపోతున్నాను.... అంటూ మోకాళ్ళ సందున తల వాల్చుకున్నాడు.

నామాలయ్య ఆ మాటలు వింటూ, విదేశీ మద్యాన్ని రెండు గ్లాసుల్లోకి వంచి, వాటిని టీపాయ్ మీద ఉంచి, పాదరసపు గోళంలా తాను మంచం మీదికి చేరాడు. "మరేం బాధపడకు! రేపటి ఎన్నికల్లో పేదరికానికి వ్యతిరేకంగా మేము సరికొత్త ఉద్యమాన్ని లేవదీస్తాం. ఆ విషయం మా కొదిలేసి, ఈ గ్లాసు నువ్వు కొట్టేసి కళ్ళు మూసుకొని పడుకో" అంటూ గ్లాసును దాసు వైపుకు నెట్టాడు.

మనుషుల బుద్ధులకు తెగులు పట్టడానికి అసలు కారణం ఎవరో చటుక్కున స్ఫురించింది దాసుకు. "తండ్రీ! ఇప్పుడే తాగకండి! ఒక్కక్షణం" అంటూ జేబులోనుంచి ఎండ్రిన్ సీసా తీసి టీపాయ్ మీద పెట్టాడు. "ఈ ఎండ్రిన్ గొంతులో పోసుకోవల్సింది నేను కాదు, తండ్రీ! ఎందుకంటారా? నేను కట్టుకున్న పెళ్ళాన్నీ కడుపున పుట్టిన పిల్లల్నీ గాలికొదిలేసిన సోమరిని కాను. అలాగని వాళ్ళ సుఖం కోసం నీతిమాలిన పనుల్ని నెత్తికెత్తుకునే వెధవనీ కాను. నా సంపాదన నాకు చాలకపోతే, పేదరికం నా వాళ్ళ బుద్ధుల్ని నమిలేస్తే, అందుకు సిగ్గుపడాల్సింది నేను కాదు...." దాసు సీసా మూతతీసి నామాలయ్య గ్లాసులో ఎండ్రిన్ కుమ్మరించాడు.

"అయితే తండ్రీ! ఇందుకు బాధ్యత మాత్రం తండ్రిదే! మీరు తండ్రులు, మేమంతా బిడ్డలం. నాకు తండ్రి మీరు. నా పెళ్ళానికి తండ్రి మీరు. నా కూతుళ్ళకు నా కొడుక్కి తండ్రి మీరే! మమ్మేలు మా తండ్రి మీరు కాక ఇంకెవరు? అయితే, తండ్రిగా మీరు మాకు చేసిందేమిటి? అవినీతిని పెంచారు. లంచగొండితనాన్ని పెంచారు. పేదరికాన్ని పెంచారు. దిక్కులేనితనాన్ని పెంచారు. వ్యభిచారాన్ని పెంచారు. తాగుబోతుతనాన్ని పెంచారు. సిగ్గు మాలిన తనాన్ని పెంచారు. మేము తింటున్న గింజల ధర పెంచారు. మేము పెట్టుకునే గోచీల ధర పెంచారు. నా కొడుకు చదివే పుస్తకాల ధర పెంచారు. డొనేషన్ల పేరుతో నా

కూతురి కాలేజీ చదువుల ఖర్చు పెంచారు. నిరుద్యోగాన్నీ, నిరాశా నిస్పృహల్నీ పెంచారు. మా నెత్తురు జుర్రుకోండని అంతస్తుల వారీగా ఉద్యోగుల దాహాన్ని పెంచారు. దొంగల్ని పెంచారు. ధనవంతులకు ఇతరుల దారిద్ర్యం అనే ముడి వస్తువులో నుంచి బంగారాన్ని పిండుకునే అవకాశాలను పెంచారు. అసమానతలను పెంచారు. ఏవేవి తగవో వాటినల్లా విపరీతంగా పెంచారు. గుర్తుకు రావటం లేదు కానీ, ఇంకా ఏమోమో చేశారు. మా రెక్కల కష్టం మాకు అందకుండా చేశారు. తండ్రీ! వీటన్నింటి ప్రభావం నా కొడుకు మనుగడపైన దెబ్బతీసి, వాడి బుద్ధిని చెడగొట్టింది. తండ్రీ, వాడు మీ బిడ్డ. ఇందుకు, తండ్రిగా మీకు సిగ్గువెయ్యటం లేదా?"

నామాలయ్య కొంతసేపు మౌనంగా ఉండి, "నువ్విన్ని మాటలంటుంటే,మాకు సిగ్గుపడదామనే అనిపిస్తోంది" అన్నాడు. ఆ మాట పూర్తయిందో లేదో, ఎండ్రిన్ కలిపిన గ్లాసును అతడికి అందించాడు దాసు.

గ్లాసు చేతపట్టుకొని నామాలయ్య నిమిషం పాటు స్థాణువులా ఉండిపోయాడు. తరవాత గ్లాసునోట పెట్టుకోబోయి సంశయంతో ఆగిపోయాడు. "వోటరు మహాశయా! నీ ఆజ్ఞ కాదనము. అయితే ఇప్పుడు కాదు. ఈసారి ఎన్నికల్లో మేము గెలవనీ. ఆ తరవాత ఎండ్రిన్ తాగేవాళ్ళల్లో మేమే మొదటి వాళ్ళం!" అంటూ ఆ గ్లాసు టీపాయ్ మీద పెట్టి రెండో గ్లాసు అందుకుని గడగడా తాగేశాడు. లేచి వెళ్ళి లాల్చీ జేబులోంచి నోటు ఒకటి లాక్కొచ్చి, "వోటరు మహాశయా! నువ్వు చావకు! ఇదిగో, ఈ పదిరూపాయలూ తీసుకుపోయి ఆ కుర్రాడి మొహాన పారెయ్!" అన్నాడు.

నామాలయ్య దాన్ని పది రూపాయలన్నాడు కానీ, అది వంద రూపాయల నోటు. అయినా, అది పదయినా, వందయినా దాసుకెందుకు? "మీకే సిగ్గు లేనప్పుడు నేనెందుకు చస్తాను తండ్రీ? ఆ పదీ మీరే ఉంచుకుని, నేను కోరి ప్రార్థించేది కాదనకుండా ఇస్తారా?" అన్నాడు దాసు.

"ఏం కావాలో చెప్పు!" అప్పటికి శరీరంపైన స్వాధీనం పూర్తిగా కోల్పోయే స్థితికి వచ్చాడు నామాలయ్య.

"మీ కాలి చెప్పుతో నన్ను రెండు దెబ్బలు కొట్టండి!" అంటూ కొక్కేనికి వేలాడుతున్న చెప్పును తెచ్చి ఇచ్చాడు దాసు.

"చా! ఇదేం కోరిక?"

"నేను బతిమాలుతుంటే, మీకెందుకు అభ్యంతరం?"

"అవునూ, ఎందుకిలా కొట్టమంటున్నావు?" అని ధర్మ సందేహంలో పడ్డాడు, నామాలయ్య.

"మొదటి దెబ్బ-కిందటి ఎన్నికల్లో నా విలువైన ఓటును మీకు వేసినందుకు, తండ్రీ!" అన్నాడు దాసు.

"అందుకా? అయితే రెండో దెబ్బ ఎందుకు?"

"ఈ సారి ఎన్నికల్లో కూడా మీకే - మమ్మేలే తండ్రులకే వోటు వెయ్యబోతున్నందుకు!"

"చెప్పవేం మరి?" అంటూ మురిసిపోతూ చెప్పు పైకెత్తాడు నామాలయ్య.

రాజకీయ అస్తవ్యస్తతకు ప్రతీకగా చెప్పులు ఉండాల్సిన చోట దీనంగా టోపీ పడి ఉంది!

● ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక 2-3-1983 ●